క్లుప్తంగా

మొసలి స్వాధీనం



నర్సంపేట : చేపల వలకు చిక్కిన మొసలి పిల్లను అటవీ శాఖ అధికారులు స్వాధీనం చేసుకుని పాకాల సరస్సులో వదిలేశారు. వివరాలిలా.. చెన్నారావుపేట మండలంలోని అప్పయ్యపేటకు చెందిన ముదిరాజ్ కులస్తులు స్థానిక ఊరచెరువులో చేపలు పడుతుండగా ముత్యాల రాంబాబు అనే జాలరి వలకు మొసలి పిల్ల చిక్కింది. దీంతో జాలర్లు సమాచారం అందించడంతో అటవీ శాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ సుధాకర్ సిబ్బందితో వెళ్లి స్వాధీనం చేసుకుని పాకాల సరస్సులో వదిలేశారు. కార్యక్రమంలో అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్ సరిత, బీట్ ఆఫీసర్ యోగి, డ్రైవర్ శివ, తదితరులు పాల్గొన్నారు.

పరిశీలకుల నియామకం

నర్సంపేట : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులను మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి నియమించారు. ఆయన గురువారం ఓ ప్రకటనలో వివరాలు వెల్లడించారు. చెన్నారావుపేటకు గుగులోతు రామస్వామి, నెక్కొండకి రాయిడి రవీందర్‌రెడ్డి, ఖానాపురం మండలానికి నల్ల మనోహర్‌రెడ్డి, నర్సంపేటకు నామాల సత్యనారాయణ, నల్లబెల్లికి మునిగాల వెంకట్‌రెడ్డి, దుగ్గొండికి నాగెల్లి వెంకటనారాయణను నియమించారు.

కన్వీనర్‌గా కోమాండ్ల గోపాల్‌రెడ్డి

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండల కన్వీనర్‌గా కోమాండ్ల గోపాల్‌రెడ్డి, సభ్యులుగా ఈర్ల నర్సింహరాములు, మోటూరి రవి, భూక్య వీరన్న, కొడారి రవి, కట్ల సుదర్శన్‌రెడ్డి, బండారి రమేశ్ నియమితులయ్యారు.

కన్వీనర్‌గా బత్తిని శ్రీనివాస్

ఖానాపురం : మండల కన్వీనర్‌గా మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్‌ను మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ప్రకటించారు. సభ్యులుగా వేములపల్లి ప్రకాశ్‌రావు, ఉపేందర్‌రెడ్డి, మౌలానా, బాలును ఎన్నుకున్నారు.

ఆహ్వాన పత్రిక అందజేత



నర్సంపేట : పట్టణంలో అక్టోబర్ 4 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించనున్న కంఠ మహేశ్వర స్వామి ఉత్సవాలకు హాజరు కావాల్సిందిగా కోరుతూ మున్సిపల్ మాజీ చైర్మన్ నాగెల్లి వెంకటనారాయణకు గౌడ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కోల వెంకటేశ్వర్లు, మద్దెల శ్రీనివాస్ గురువారం ఆహ్వాన పత్రిక అందజేశారు. అనంతరం వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ మాట్లాడారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు గాదగోని సాంబయ్య, ఆర్థిక కార్యదర్శులు గిరగాని కిరణ్, సదానందం, సభ్యులు తాళ్లపెల్లి శ్రీనివాస్, వేముల కృష్ణ, ప్రమోద్, మొగలగాని సురేశ్, సుక్క రవి, తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా మొరం తరలిస్తే చర్యలు తప్పవు

వర్ధన్నపేట : అక్రమంగా మొరం తరలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని ఎస్సారెస్పీ డీఈ కిరణ్ తెలిపారు. పట్టణ శివారులోని డీసీతండా సమీపంలో, రాయపర్తి శివారులోని గుబ్బడి తండా వద్ద ఎస్సారెస్పీ కాల్వ వెంట ఉన్న మొరాన్ని అక్రమంగా తరలిస్తున్నారనే విషయం తెలిసిందని పేర్కొన్నారు. భారీ హిటాచీలు, టిప్పర్లు, జేసీబీలు, ట్రాక్టర్లతో తవ్వకాలు చేపట్టి తరలిస్తున్నారనే సమాచారం ఉందని తెలిపారు. గత నెలలో ఓ వ్యక్తికి మూడ్రోజులపాటు తరలించుకునేందుకు అనుమతి ఇచ్చామని, అనంతరం ఎవరికీ అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. పోలీసులు దాడి చేసి ఓ టిప్పర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిసిందని తెలిపారు.

ఆలయాల పూజారులకు అవార్డులు ఇవ్వాలి

దుగ్గొండి : శ్రీ మహా విష్ణువుకు ఎంగిలి పండ్లు తినిపించిన శబరి, శివుని భక్తుడైన కన్నప్ప, భక్త రామదాసుకు విశేష సేవలందించిన పోకల దమ్మక్క పేరిట పూజారులకు ఏటా అవార్డులు ఇవ్వాలని మండలంలోని ముద్దునూరు శ్రీ శివ రామాంజనేయస్వామి ఆలయ పూజారి రాములు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. ఆయన ఆలయ ఆవరణలో గురువారం 11 రోజుల దీక్ష చేపట్టారు. మీడియాతో మాట్లాడారు. ఉత్తమ పూజారులను ఎంపిక చేసి అవార్డులు ఇవ్వాలన్నారు. దీక్షను బాసరలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో విరమణ చేయనున్నట్లు తెలిపారు.

రేపు సామాజిక తనిఖీ

నర్సంపేట రూరల్ : నర్సంపేట మండలంలోని 27 గ్రామపంచాయతీల పరిధిలోని మహాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై రేపు (ఈనెల 27న)సామాజిక తనిఖీ నిర్వహిస్తామని ఎంపీడీఓ శ్రీనివాసరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 14 నుంచి గ్రామస్థాయిలో సర్వే, సభలు నిర్వహించినట్టు పేర్కొన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

మాంసం విక్రయాల్లో అక్రమాలు

- మృతి చెందిన, వ్యాధులు సోకిన జీవాలను వధించి..

నల్లబెల్లి : మాంసం విక్రయాల్లో అక్రమాలు చోటు చేసుకుంటున్నట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మేకలు, గొర్రెపోతుల మాంసం పట్ల పలువురు ఆసక్తి చూపుతుండడంతో డిమాండ్ పెరిగి ధర తారాస్థాయికి చేరింది. మాంసం విక్రయాలపై అధికారుల తనిఖీలు కొరవడడంతో మండలంలో కొందరు అధిక లాభాలే లక్ష్యంగా యథేచ్ఛగా మృతి చెందిన, వ్యాధులు సోకిన జీవాలను వధించి విక్రయిస్తున్నట్టు తెలుస్తోంది. అమ్ముడుపోగా మిగిలిపోయిన మాంసాన్ని రిఫ్రిజిరేటర్లలో నిల్వచేస్తూ మరుసటి రోజు అమ్ముతున్నారన్న వ్యాఖ్యలూ ఉన్నాయి.

మండల కేంద్రంలో నలుగురు వ్యాపారులు ఆది, బుధ, శుక్రవారాల్లో గొర్రెలను కోసి కిలో మటన్ రూ.800 చొప్పున సుమారు 150 కిలోలకు పైగా విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఆ నలుగురిలో ఓ వ్యాపారి మృతి చెందిన, వ్యాధుల బారిన పడిన గొర్రెలను కోసం వాటి మాంసాన్ని సమీపంలోని మద్యం షాపు సమీపంలో చౌక ధరకు అంటగడుతున్నట్టు తెలిసింది. మటన్ నాణ్యతపై ప్రశ్నిస్తే దాటవేత ధోరణి అవలంభిస్తున్నట్టు పలువురు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు.



మాంసం విక్రయాలు

మిగిలిన మటన్ మరుసటి రోజు విక్రయం

మిగిలిన మాంసాన్ని ఫ్రిడ్జిల్లో నిల్వ చేసి మరుసటి రోజు విక్రయిస్తున్నారని పలువురు వాపోయారు. స్వార్థ లాభాపేక్షతో దుర్వాసన వస్తున్న మాంసాన్ని సైతం విక్రయిస్తున్నట్టు ప్రచారంలో ఉంది. ఇకనైనా సంబంధిత శాఖల అధికారులు సమగ్ర విచారణ చేపట్టి మండలంలో నాణ్యమైన మాంసం మాత్రమే విక్రయించేలా చర్యలు చేపట్టాలని మాంసాహారులు కోరుతున్నారు.

లాభాపేక్షతో విచ్చలవిడిగా..



మండల కేంద్రంలో లాభాపేక్షతో మృతి చెందిన, వ్యాధుల బారిన పడిన గొర్రెలు, మేకలను విచ్చలవిడిగా కోస్తూ అమ్ముతున్నారు. ప్రశ్నిస్తే చౌక మటన్ అని నమ్మిస్తున్నారు. వ్యాధుల బారిన పడిన గొర్రెల, మేకల మాంసం భుజించే జనం రోగాల బారిన పడే ప్రమాదం ఉంది. అధికారులు విచారణ చేపట్టాలి.

– బొడిగె సమ్మయ్య, గ్రామస్తుడు

వ్యాధుల బారిన పడే ప్రమాదం



అనారోగ్యంతో ఉన్న, మృతి చెందిన జీవాల మాంసాన్ని తింటే వ్యాధుల బారిన పడే ప్రమాదం ఉంది. వ్యాధుల బారిన పడిన జీవాల ప్రాణాలు కాపాడేందుకు ఇచ్చిన యాంటీ బయాటిక్స్ మనుషుల కాలేయం, ఊపిరితిత్తులు, మొదడుపై దుష్ప్రభావం పడుతుంది.

– వేణు, పశు వైద్యాధికారి

విశ్వకల్యాణమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యం



శతాబ్ది ఉత్సవాల్లో మాట్లాడుతున్న విఘ్నేశ్వర్

- విభాగ్ ప్రచారక్ కడమంచి విఘ్నేశ్వర్

నెక్కొండ : విశ్వ కల్యాణమే లక్ష్యంగా రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) కార్యక్రమాలు నిర్వహిస్తోందని విభాగ్ ప్రచారక్ కడమంచి విఘ్నేశ్వర్ తెలిపారు. మండల కేంద్రంలోని ఓ గార్డెన్ ఆవరణలో గురువారం నిర్వహించిన సంఘ్ శతాబ్ది ఉత్సవాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. హిందువులందరూ సంఘ్‌లో చేరి స్వయం సేవకులుగా బాధ్యత తీసుకోవాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణ, కుటుంబ విలువల పెంపు, నైతికత అలవర్చుకోవడం, స్వదేశీ విధానాన్ని అనుసరించడం వంటి అంశాలను ఆచరించాలని సూచించారు. తద్వారా మెరుగైన సమాజం నిర్మితమవుతుందని తెలిపారు. దేశంలో శాంతి నెలకొందని చెప్పారు. సమావేశంలో సంఘ్ చాలక్ పరిపాటి ఇంద్రసేనారెడ్డి, ప్రసాద్, చంగల రాజు, బొబ్బాల ప్రతాప్‌రెడ్డి, కొమురవెల్లి సతీశ్, పింగిలి మోహన్‌రెడ్డి, నాయిని అశోక్, శ్రీరంగం సంపత్, దామరచర్ల రామారావు, బోళ్ల రంజిత్, కక్కెర్ల అనిల్, కాసుల రత్నయ్య తదితరులు పాల్గొన్నారు.

'పాలధార'లో రాజేందర్ పాట



నర్సంపేట : ప్రజాయుద్ధ నౌకగా గుర్తింపు పొందిన గద్దర్ అమరత్వంపై గద్దర్ ఫౌండేషన్ 'పాలధార' పేరుతో ప్రచురించిన పుస్తకంలో చెన్నారావుపేట మండలంలోని అక్కల్‌చెడ గ్రామానికి చెందిన కవి, గాయకుడు పడిదం రాజేందర్ రచించిన 'తూరుపు పొద్దయ్ పొడిసెనో గద్దరన్న పాట' గేయం ముద్రితమైంది. ఈ సందర్భంగా పాటల పుస్తకాన్ని రాజేందర్ మండల కేంద్రంలో మీడియాకు ప్రదర్శించి మాట్లాడారు. ప్రముఖ కవుల సరసన తన పాట ప్రచురితమవడం ఆనందంగా ఉందన్నారు.

విద్యుత్ లైట్లకు మరమ్మతు

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని కాల్‌నాయక్‌తండాలోని విద్యుత్ లైట్లకు పంచాయతీ కార్యదర్శి గొడిశాల వికాస్ గౌడ్ గురువారం మరమ్మతు చేయించారు. కాల్‌నాయక్‌తండా, బాల్‌నాయక్‌తండాల్లో 26 చోట్ల వీధి లైట్లు చెడిపోగా వాటి స్థానంలో విద్యుత్ సిబ్బందితో కొత్త వాటిని ఏర్పాటు చేయించారు. నూతన విద్యుత్ లైట్ల ఏర్పాటుతో తండావాసులు హర్షం వ్యక్తం చేశారు.

దీన్ దయాళ్ ఆశయాలను కొనసాగించాలి

- మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు



నివాళులర్పిస్తున్న ధర్మారావు, నాయకులు

గీసుకొండ : పండిట్ దీన దయాళ్ ఉపాధ్యాయ్ ఆశయాలను కొనసాగించాలని బీజేపీ నాయకులు, మాజీ ఎమ్మెల్యే మార్తినేని ధర్మారావు తెలిపారు. మండల కేంద్రంలోని ఆ పార్టీ జిల్లా కార్యాలయంలో గురువారం పండిట్ దీన్ దయాళ్ జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా దీన్ దయాళ్ చిత్రపటానికి ధర్మారావు పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. దీన్ దయాల్ ఆశయాలు కొనసాగించడాన్ని నిజమైన నివాళిగా అభివర్ణించారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీశ్, రత్నం సతీశ్, వన్నాల వెంకటరమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి బాకం హరిశంకర్, నాయకులు కనుకుంట్ల రంజిత్, రఘునారెడ్డి, కుమార్, గట్టి గొప్పుల రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వంద కొట్టు.. పోతును పట్టు

నెక్కొండ : 'వంద కొట్టు పోతును పట్టు' అంటూ మండలంలోని అప్పల్‌రావుపేటలో గురువారం వెలసిన లక్కీ డ్రా ఫ్లెక్సీ జనాన్ని ఆకర్షిస్తోంది. దసరా పండగ సందర్భంగా గ్రామానికి చెందిన యువకులు లక్కీ డ్రా నిర్వహించనున్నట్టు ఫ్లెక్సీలో పేర్కొన్నారు. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఒక్కో కూపన్ ధర రూ.వందగా నిర్ణయించారు. డ్రాలో గెలిస్తే ప్రథమ బహుమతిగా పొట్టేలు, తర్వాతి బహుమతులుగా పలు రకాల మద్యం అందించనున్నట్టు నిర్వాహకులు పేర్కొన్నారు.

కాంగ్రెస్ గ్రామ కమిటీల ఎన్నిక



నర్సంపేట : సన్మానిస్తున్న అధ్యక్షుడు రమేశ్

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేట, అమృతండా గ్రామాల్లో కాంగ్రెస్ గ్రామ కమిటీలను పార్టీ మండల అధ్యక్షుడు సిద్దన రమేశ్ గురువారం ఎన్నుకున్నారు. పాపయ్యపేట కమిటీకి అధ్యక్షుడిగా ఉప్పరి కొమురయ్య, అమృతండా కమిటీకి అధ్యక్షుడిగా బోడ నర్సింహ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మండల రవి, ఉపాధ్యక్షులుగా అబ్బదాసి సుధాకర్, బుడిగె వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా అన్నబోయిన అనిల్, కోశాధికారిగా మొర్రి వీరస్వామి, సహాయ కార్యదర్శిగా భానోతు సుమన్, యూత్ ప్రెసిడెంట్‌గా మేడి సాయి, అమృతండా కమిటీ ఉపాధ్యక్షుడిగా మంగీలాల్, ప్రధాన కార్యదర్శిగా భూక్య బాలు, సహాయ కార్యదర్శిగా నూనావత్ నర్సు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు రమేశ్ మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాల్లో పార్టీ జెండా ఎగరేయాలని సూచించారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తప్పెట రమేశ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బండి హరీశ్, తదితరులు పాల్గొన్నారు.

గౌడ సంఘం కమిటీ..

సంగెం : మండలంలోని గవిచర్లలో గౌడ సంఘం గ్రామ కమిటీని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా గుళ్లపల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా దొనికెల అశోక్, ప్రధాన కార్యదర్శిగా మందపురం అశోక్, కోశాధికారిగా కూనూరి రమేశ్, డైరెక్టర్లుగా దొనికెల శ్రీధర్, కొయ్యడ సదయ్య, గుండబోయిన భాస్కర్, బొమ్మగాని శ్రీధర్, గుళ్లపల్లి రాజు, పోశాల కుమారస్వామి ఎన్నికైనట్టు అధ్యక్షుడు శ్రీనివాస్ ప్రకటించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడారు. గౌడ కులస్తుల సంక్షేమానికి, సంఘం బలోపేతానికి పాటుపడాలని కోరారు.

లంబాడీ జేఏసీల..

ఖానాపురం : మండలంలోని భద్రుతండాకు, కొడ్తిమాటుతండాకు లంబాడీ జేఏసీలను మండల కమిటీ అధ్యక్షులు గుగులోతు కిషన్‌నాయక్, జాటోతు సదర్‌లాల్ ఆధ్వర్యంలో గురువారం ఎన్నుకున్నారు. భద్రుతండా అధ్యక్షుడుగా ఆంగోతు రమేశ్, కోకన్వీనర్‌గా వాంకుడోతు కుమార్, కొడ్తిమాటుతండా అధ్యక్షుడుగా ఆంగోతు సందీప్, కోకన్వీనర్‌గా గుగులోతు రాంచందర్ ఎన్నికయ్యారు. సమావేశంలో నాయకులు బాలు, బాలకిషన్, భూక్య వెంకన్న, ప్రవీణ్, సుమన్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.

పీడీకి అవార్డు



రాయపర్తి : మండలంలోని కాట్రపల్లికి చెందిన ఫిజికల్ డైరెక్టర్ (పీడీ) పుట్ట సమ్మయ్య జాతీయ అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లో శారద ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్సీ మల్క కొమురయ్య చేతుల మీదుగా సమ్మయ్య అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా సమ్మయ్య మీడియాతో మాట్లాడారు. కాట్రపల్లి ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు క్రీడల్లో రాణించేలా కృషి క్రమంలోనే అయన్ను నిర్వాహకులు అవార్డుకు ఎంపిక చేసినట్టు తెలిపారు.

కోతకు గురైన రిజర్వాయర్ కట్ట



పర్వతగిరి : మండల కేంద్రంలోని పెద్దచెరువు రిజర్వాయర్ కట్ట కోతకు గురై ప్రమాదకరంగా మారింది. కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో కట్ట కోతకు గురికాగా ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. రెవెన్యూ అధికారులు కట్టను సందర్శించి ప్రమాదకరంగా ఉందని ఇరిగేషన్ అధికారులకు నివేదిక అందించారు. త్వరలో మరమ్మతులు చేపడతామని సంబంధిత అధికారులు తెలిపారు.

'కుల వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడండి'



సమావేశంలో మాట్లాడుతున్న ప్రతాప్‌రెడ్డి

నర్సంపేట : సత్యశోధక్ సమాజ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కులవ్యవస్థకు వ్యతిరేకంగా పోరాడాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి మొగిలి ప్రతాప్‌రెడ్డి కోరారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంస్కరణ, అణగారిన వర్గాలకు, శూద్రులకు, మహిళలకు విద్య సాంఘిక హక్కుల కల్పన కోసం మహాత్మా జ్యోతిరావు పూలే కులవ్యవస్థకు వ్యతిరేకంగా 1973 సెప్టెంబర్ 24న పోరాటం నిర్వహించారని తెలిపారు. ఈనెల 30వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహిస్తామన్నారు. శూద్రులను అగ్రకులాల నుంచి రక్షించడాన్ని మహాత్మా జ్యోతిరావు పూలే, సత్యశోధక్ సమాజ్ సంస్థ ప్రధాన లక్ష్యాల్లో ఒకటిగా తెలిపారు. సమావేశంలో నాయకులు ఆబర్ల రాజన్న, మధు, పెద్దబోయిన అశోక్, రవి తదితరులు పాల్గొన్నారు.

శ్రమ విలువ తెలుసుకోవాలి

దామెర : విద్యార్థులు శ్రమ విలువ తెలుసుకోవాలని శివం ట్రస్ట్ చైర్మన్, కాంగ్రెస్ జిల్లా నాయకుడు బిల్లా రమణారెడ్డి కోరారు. స్థానిక శివాలయ పరిసరాల్లో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు శ్రమదానం చేశారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడారు. విద్యార్థులు సామాజిక సేవల్లో భాగస్వాములు కావాలన్నారు. సాఫ్ట్ స్కిల్స్‌పై అధ్యాపకుడు రాజేంద్రప్రసాద్ వివరించారు. సమావేశంలో అధ్యాపకులు కమలాదేవి, రేణుక, తదితరులు పాల్గొన్నారు.

రికార్డుల్లో తప్పులు దొర్లకుండా చూడాలి

ఐనవోలు : ఉపాధి హామీ పనుల రికార్డుల్లో తప్పులు దొర్లకుండా చూసుకోవాలని డీఆర్డీఓ మేన శ్రీను అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో 2024–25 ఆర్థిక సంవత్సరంలో మండలంలోని 17 గ్రామ పంచాయతీల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో నిర్వహించిన పనులకు సంబంధించి ఐదో విడత సామాజిక తనిఖీల్లో భాగంగా ఎంపీడీఓ నర్మద ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రొసీడింగ్ ఆఫీసర్, డీఆర్డీఓ శ్రీను హాజరై మాట్లాడారు. ఏప్రిల్ 2024 నుంచి మార్చి 2025 వరకు మండలవ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో కూలీలకు రూ.2.55 కోట్లు, పంచాయతీ రాజ్ విభాగంలో రోడ్లు, మన ఊరు మనబడి పనులకు రూ.3.23 కోట్లు కాగా మొత్తం రూ.5.78 కోట్లు చెల్లించినట్లు అధికారులు తెలిపారు. మొత్తం పనులను ఆడిట్ చేశారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి నర్సింహారెడ్డి, అంబుడ్స్‌మెన్ నాగరాజు, క్వాలిటీ కంట్రోల్ అధికారి పుష్పలత, అజయ్‌కుమార్, ఏపీఓ కుమారస్వామి, ఎంపీఓ రఘుపతి రెడ్డి, శ్రీధర్, ప్లాంటేషన్ మేనేజర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట : అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు



నల్లబెల్లి : పూజ చేస్తున్న భక్తులు



దుగ్గొండి : మల్లంపల్లిలో..

నర్సంపేట/దుగ్గొండి/నల్లబెల్లి : నర్సంపేట, దుగ్గొండి, నల్లబెల్లి, చెన్నారావుపేట, తదితర మండలాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు నాల్గో రోజు గురువారం కొనసాగాయి. నర్సంపేట, దుగ్గొండి, నల్లబెల్లి మండలాల్లో దుర్గామాత కాత్యాయనిదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. చెన్నారావుపేటలోని సిద్ధేశ్వరాలయంలో అర్చకులు దుర్గాదేవిని మహాలక్ష్మిగా అలంకరించారు. భక్తులు కుటుంబాలతో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇళ్ల నిర్మాణంలో నిబంధనలు తప్పనిసరి

- టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి



లబ్ధిదారుకు మంజూరు పత్రం ఇస్తున్న రంజిత్‌రెడ్డి

నెక్కొండ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి స్పష్టం చేశారు. మండల కేంద్రంలో లబ్ధిదారు ఆవురుపెల్లి పద్మ చేపట్టిన ఇంటి నిర్మాణానికి ఆయన గురువారం భూమి పూజ చేసి మాట్లాడారు. సకాలంలో నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం దశలవారీగా నిర్మాణాన్ని బట్టి నిధులు విడుదల చేస్తుందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలోనే పేదలకు ఇళ్లు దక్కుతాయని తెలిపారు. అర్హులందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని చెప్పారు. తొలుత లబ్ధిదారుకు ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రం అందజేశారు. కార్యక్రమంలో స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, పార్టీ మండల, అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బక్కి అశోక్, కుసుమ చెన్నకేశవులు, గ్రామ కార్యదర్శి సదానందం, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణల పేరుతో మోసం

- బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాజిరెడ్డి

వర్ధన్నపేట : పేద, మధ్య తరగతి వర్గానికి ఉపయోగపడని విధంగా జీఎస్టీ పన్నుల విధానంలో సంస్కరణల పేరుతో మార్పులు తీసుకొచ్చి కేంద్ర ప్రభుత్వం మోసం చేస్తోందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అబ్బిడి రాజిరెడ్డి ఆరోపించారు. మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నరుకుడు వెంకటయ్యతో కలిసి గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజిరెడ్డి మాట్లాడారు. జీఎస్టీ వల్ల దేశంలోని పెట్టుబడిదారులు లాభపడ్డారని చెప్పారు. సామాన్య ప్రజలు కొనుగోలు చేసే నిత్యావసర సరుకుల ధరలు తగ్గలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీని ఆధీనంలో ఉంచుకుని రాష్ట్రాలను బిచ్చమడుక్కునేలా చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగం కల్పించిన సమాఖ్య స్ఫూర్తిని దెబ్బ తీస్తోందని ధ్వజమెత్తారు. సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి పోశాల వెంకన్న గౌడ్, కొత్తపెల్లి గ్రామ కమిటీ కమిటీ అధ్యక్షుడు తాళ్లపెల్లి యాదగిరి గౌడ్, ల్యాబర్తి గ్రామ కమిటీ పార్టీ అధ్యక్షుడు చిదుముళ్ల భాస్కర్, నాయకులు మరుపట్ల సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల్లో పోషక విలువలు



పోషకాహార వారోత్సవాల్లో మాట్లాడుతున్న సూపర్‌వైజర్ రాధ

- ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ

నర్సంపేట : చిరుధాన్యాల్లో పోషక విలువలు ఉంటాయని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధ తెలిపారు. పోషకాహార వారోత్సవాల సందర్భంగా చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లిలోని అంగన్‌వాడీ సెంటర్‌లో గురువారం బతుకమ్మ ఆటపాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి రాధ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులు ఆహారంలో ఆకు కూరలు, కూరగాయలు, పాలు, గుడ్లు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. జంక్ ఫుడ్ తీసుకోవద్దని చెప్పారు. పోషకాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించొచ్చని తెలిపారు. పోషకాహారంపై మహిళలు అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని సూచించారు. ఎన్‌ఆర్‌ఐ టీమ్ సభ్యులు శివంగి కర్మాకర్, తసి చోపేదన్ పాల్గొని అంగన్‌వాడీ కేంద్రం పనితీరుపై అధ్యయనం చేశారు. కార్యక్రమంలో ఏపీఎం తిలక్, అంగన్‌వాడీ టీచర్లు రజిత, విజయలక్ష్మి, సరోజన, ఆయాలు నీలమ్మ, శారద, కట్టమ్మ, సీసీ బాబు, సీఏలు శ్యామ్, మంజుల, శరత్, తదితరులు పాల్గొన్నారు.

అమ్మపేరుతో మొక్క నాటాలి

దామెర: ప్రతిఒక్కరూ అమ్మపేరుతో మొక్క నాటాలని బీజేపీ రాష్ట్ర నాయకులు డాక్టర్ పెసరు విజయ్‌చందర్‌రెడ్డి, డాక్టర్ పగడాల కాశీప్రసాద రావు కోరారు. సేవా పక్షంలో భాగంగా స్థానిక ప్రభుత్వ పాఠశాలలో వారు మొక్కలు నాటి మాట్లాడారు. మొక్కలు నాటడం వల్ల పర్యావరణ పరిరక్షణతోపాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీరాంరెడ్డి, మండల అధ్యక్షుడు రాజ్‌కుమార్, నాయకులు రమేశ్, రమణారెడ్డి, సారయ్య, బుచ్చిరెడ్డి, కిషన్ రెడ్డి, రవీందర్, తదితరులు పాల్గొన్నారు.